

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. బాధితులకు ఆదివారం అందజేశారు. బొండపల్లి మండలం మరువాడ గ్రామానికి చెందిన వెల్దుర్తి సత్యానికి రూ.2.21 లక్షలు, గట్టుపల్లి గ్రామానికి చెందిన గుల్లిపల్లి నవ్య, నరేష్ దంపతులకు రూ.2.28 లక్షలు చెక్కులను మంత్రి అందించారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

నెల రోజుల నుంచి చిట్టీలు, అప్పులు వ్యవహారం భోగాపురాన్ని కుదిపేస్తోంది. ఏ నోట విన్నా ఈ చిట్టీలు, అప్పల మాటే వినబడుతోంది. కష్టపడి రూపాయి రూపాయి సంపాదించి కుమార్తె వివాహానికో, లేక పిల్లల చదువుకో, ఇల్లు కట్టుకోవడానికో, ఇంకేదేనికైనా పనికొస్తాయనే ఉద్దేశంతో చిట్టీలు వేసిన వారంతా బోరుమంటున్నారు. అప్పలిచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు. పెద్దమనుషుల చుట్టూ తిరిగి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇలా మోసపోయిన బాధితులు సుమారు 500మంది పైనే ఉన్నారు. అంతేకాక ఒక్కొక్కరు రూ.5 లక్షల నుంచి సుమారు రూ.50 లక్షల వరకు మోసపోయారు. ఇలా మోసపోయిన సొమ్ము సుమారు రూ.30 కోట్ల పైనే ఉంటుందని బాధితులు చెబుతున్నారు.



చిట్టీలు వేసిన వ్యక్తిని నిలదీస్తున్న బాధితులు

- బాధితుల సంఖ్య 500 మందికి పైనే
- నిర్వాహకుడి కాళ్లపై పడి బోరుమన్న మహిళలు
- మోసపోయిన కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు
- పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు
- నెల రోజుల నుంచి భోగాపురాన్ని కుదిపేస్తున్న చిట్టీలు, అప్పల వ్యవహారం

చిట్టీల పేరుతో రూ.30 కోట్లకు టోకరా!

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నమ్మకంగా గత పదేళ్ల నుంచి చిట్టీలు వేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ చిట్టీలు పాడిన వారికి సొమ్ము ఇచ్చేవాడు. అంతేకాక లాభాలు కూడా భారీగా వచ్చేవి. దీంతో భోగాపురంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన రోజువారి కూలీల నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే చాలా మంది ఆయన వద్ద చిట్టీలు వేయడం ప్రారంభించారు. వారేకాక బంధువులకు సైతం చెప్పడంతో వారు కూడా ఇక్కడే చిట్టీ కట్టేవారు. అక్కడ నుంచి చిట్టీలు పాడిన వారికి వడ్డీ ఎరగా వేశాడు. ఎవరైతే చిట్టీలు పాడుతారో, వారికి సొమ్ము ఇవ్వకుండా ఆ సొమ్ముకు వచ్చే వడ్డీతో మరో చిట్టీ వేయించేవాడు. వడ్డీలు వస్తున్నాయి.. చిట్టీలు పెరిగి సొమ్ము రెట్టింపు అవుతోందన్న ఆశతో అలా చేశారు. అక్కడితో ఆ వ్యక్తి ఆగకుండా ఇంకొంతమంది నుంచి అప్పులు వాడటం మొదలు పెట్టాడు. చిట్టీలు వేసిన వ్యక్తి ఖరీదైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఒక ఉపాధ్యాయుడితోపాటు మరో ఇద్దరు వ్యక్తులు చిట్టీలను ఈయన వద్దే వేశారు. చిట్టీలు తక్కువకు పాడేసి తిరిగి చెల్లించేందుకు అప్పులు చేశారు. అప్పుల్లో కూరుకుపోయామని, ఇప్పట్లో చెల్లించలేమంటూ వీరు ముగ్గురు చేతులెత్తేశారు. చిట్టీల నిర్వాహకుడు ఇదే అదునుగా తానూ చెల్లించలేనంటూ ఈనెల పదో తేదిన ఏకంగా ఒక లేఖ రాసి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

కాళ్లపై పడి బోరుమన్న మహిళలు

ఆసుపత్రి నుంచి వచ్చిన తరువాత గ్రామంలోని పెద్దమనుషుల సమక్షంలో చిట్టీలు వేసిన వ్యక్తిని పిలిపించి బాధితులు మాట్లాడారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హాజరైన బాధితులు ఆ వ్యక్తి కాళ్లపై పడి తమ సొమ్ము తిరిగి ఇచ్చేయాలంటూ బోరుమన్నారు. కష్టపడి పైసా పైసా సంపాదించి చిట్టీలు కట్టామని, తమను మోసచేయొద్దని, సొమ్ము తిరిగి ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. కాని ఆ వ్యక్తి మాత్రం కనీసం చలించకపోవడం విశేషం. తాను అప్పుల్లో కూరుకుపోయానని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని కొంతమంది బాధితులు అంటున్నారు. మరికొంతమంది మాత్రం హైదరాబాద్‌లో ఆస్తులు కొనుగోలు చేశాడని చెబుతున్నారు. పెద్దమనుషులు రంగంలోకి దిగడంతో వీరు ఏమేరకు బాధితులకు న్యాయం చేస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. అందుకనే సంబంధిత వ్యక్తిపై నేటికీ ఒక్కరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పలువురు చెబుతున్నారు.

కూలీలు, చిరుద్యోగులే అధికం

ఈ చిట్టీలు వేసిన వ్యక్తి చేతిలో మోసపోయిన వారిలో రోజువారి కూలీలు, చిరుద్యోగులే ఎక్కువ మంది ఉన్నారు. టైలరింగ్ చేసే ఓ మహిళ పదేళ్ల నుంచి రూపాయి రూపాయి కూడబెట్టి చిట్టీలు వేసింది. ఇలా సుమారు రూ.37 లక్షల వరకు మోసపోయింది. ఒక్కో ఉపాధ్యాయుడు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు ఇలా అనేక మంది సుమారు రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు చిట్టీలు, అప్పల పేరుతో ఈ వ్యక్తి చేతిలో మోసపోయారు. గ్రామంలో చాలా మంది లక్షల్లోనే రూ.అప్పులు ఇచ్చారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన ముందురోజు కూడా ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు అప్పు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇలా మోసపోయిన బాధితులు 500 మంది పైనే ఉంటారని, ఆ మొత్తం దాదాపు సుమారు రూ.30 కోట్లకు పైగా ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

బిందు సేద్యం.. ఉద్యాన రైతుకు వరం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



రైతులకు పథకం మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉద్యాన రైతులకు బిందు సేద్యం ఒక వరమని, దీనిని ప్రతి రైతు వినియోగించుకొని లబ్ది పొందాలని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి మంత్రి రైతులకు తొలి విడత బిందు, తుంపర సేద్య పరికరాలను పంపిణీ చేశారు. ఈ పరికరాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ బిందు సేద్యం వల్ల భూగర్భ జలాల పరిరక్షణతో పాటు విద్యుత్ వినియోగం, సాగు ఖర్చులో ఆదా అవుతుందని, రైతుకు రాబడి అధికంగా వస్తుందని తెలిపారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఉన్న వారెవరైనా ఈ పథకం కింద సూక్ష్మనీటి సేద్య పరికరాలు పొందుటకు అర్హులని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాదికి 7625 ఎకరాల్లో బిందు సేద్యం లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం 86 మంది రైతులకు రూ.91.81 లక్షల విలువైన పరికరాలను రూ.58.17 లక్షల రాయితీపై అందించినట్లు వివరించారు.

90 శాతం రాయితీపై..

చిన్న, సన్నకారు రైతులకు రూ.2.18 లక్షల రాయితీ వరకు డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో ఐదు ఎకరాలకు మించకుండా అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. 5 నుండి 12.50 ఎకరాల కలిగిన రైతులకు రూ.3.10 లక్షల రాయితీ వరకు డ్రిప్ పరికరాలను ప్రస్తుతం 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. తుంపర్ల సేద్య పరికరాలను 55 శాతం రాయితీతో 5 ఎకరాలకు మించకుండా అందిస్తున్నట్లు తెలిపారు. 5 నుంచి 12.50 ఎకరాలు కలిగిన రైతులకు 45 శాతం రాయితీతో అందిస్తున్నట్లు వెల్లడించారు. రాయితీపై పరికరాలు పొందాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఎపిఎంఐపి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామారావు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ బుకారిబాబు అధ్యక్షతన జరిగింది. ఎపిటిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా ఎన్నికల కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా షేక్ బుఖారి బాబు, కన్వీనర్‌గా పాలతేరు శ్రీనివాస్ నియమితులయ్యారు.

సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు. సీనియర్ నాయకులు కె.శ్రీనివాసన్, మజ్జి రమేష్, రాష్ట్ర కౌన్సిలర్లు కర్రి రవి, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు, జిల్లా మీడియా ఇన్‌ఛార్జి మర్రాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, ఇతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 29న కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు, నగర అధ్యక్షులు బి.భాస్కరరావు కోరారు. ఆదివారం నగరంలో పాలాసుపత్రి మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిముట్లు, రక్షణ పరికరాలు తగినంత లేకుండా పనులు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. నగర విస్తీర్ణం, జనాభా పెరుగుతున్నా, పనిచేసే కార్మికుల సంఖ్య మాత్రం తగ్గిపోతుందని చెప్పారు. ఉన్న వారిపైనే తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో కనీస వేతనాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిటీ సభ్యులు అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జెవివి ప్రతిభా పరీక్షలతో

వినూత్న ఆలోచనలకు బీజం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



చెకుముకి ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు , జెవివి సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చెకుముకి సంబరాల పేరుతో జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు బీజం పడుతోందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి సంబరాలను జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెకుముకి ప్రశ్నపత్రాలను జెడ్‌పి చైర్మన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంచడమే లక్ష్యంగా జెవివి ప్రయత్నించడం అభినందనీయమన్నారు. సమాజాభివృద్ధి పట్ల ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, వైద్యులు, ఉద్యోగులు.. ఇలా అనేక మంది ఇటువంటి సంస్థలో పనిచేయడం, వారి సమయాన్ని వెచ్చించడం.. విద్యార్థులకు ఒక వరమని అభిప్రాయపడ్డారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సన్యాసమ్మ

జిల్లాలో వివిధ మండలాల నుంచి హాజరైన 34 బృందాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి డెంకాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రయివేటు పాఠశాలల నుంచి విజయనగరంలోని ది నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరు నవంబర్ 9, 10న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారు. ముగింపు సభలో ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు సన్యాసమ్మ హాజరై, మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్, పి.వేణుగోపాల్ చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అచ్చిబాబు అనేక మ్యాజిక్‌లు చేసి, అందులోని మర్మాలను విద్యార్థులకు వివరించారు. ప్రజాకళాకారుడు డప్పు శ్రీను తన పాటలతో విద్యార్థులకు వినోదాన్ని పంచారు.

ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పి.రమణ ప్రభాత్, సమతా కన్వీనర్ జి.నిర్మల, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, సత్యంనాయుడు, కె.మురళీబాబు, జిల్లా ట్రెజరర్ చెక్క సింహాచలం, నగర అధ్యక్షులు డాక్టర్ చిన్నారి, ప్రధానకార్యదర్శి శశిధర్, డాక్టర్ రమేశ్‌రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - విజయనగరం కోట

దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా నిల్వలు, విక్రయాలు, తయారీకి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో ఆదేశించారు. బాణసంచా నిల్వ ఉంచే గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక విక్రయ షాపుల వద్ద వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టేలా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలని సూచించారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండేలా, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలని సూచించారు. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు, ఫైర్ నియంత్రికలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. మనుషులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచా రవాణా చేయకుండా జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

12వ పిఆర్‌సికి సంబంధించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసినా, ప్రస్తుతం చైర్మన్ రాజీనామా చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా ఇంతవరకు నూతన చైర్మన్‌ను ఏర్పాటు చేయలేదని చెప్పారు. తక్షణమే చైర్మన్‌ను నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తక్షణమే డిఎ, గత పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలను విడుదల చేయాలని, పెండింగ్ డిఎలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఉందని, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌టియు జిల్లా నాయకులు ఎస్.ఎస్ దొర, డి.శ్రీరామ్, బంగారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-జామి

విశాఖ డైరీ పాల రైతులకిచ్చే ఆవు పాలు ధరను తగ్గించిన నేపథ్యంలో పలు డిమాండ్లతో పాల రైతుల సంఘం ధర్నాకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ నెల 29న జరగబోయే మహా ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు బుద్ధరాజు రాంబాబు రైతులను కోరారు. ఈ మేరకు మండలంలోని జామి, విజినిగిరి, జన్నివలస, వెన్నె, బీమసింగి పాటు అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, విశాఖ డైరీ వద్ద నిర్వహించబోయే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విశాఖ డైరీ యజమాన్యం అధిక లాభాలు గడించి, రైతులకు పాల ధరను తగ్గించడం అన్యాయమన్నారు. అందులో భాగంగానే పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతున్నట్లు వివరిం చారు. రైతులు పెద్ద ముందుకి వచ్చి, రైతు సంఘం పోరాటానికి మద్దతుగా నిల వాళన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

జెఎసి సమావేశాన్ని విజయవంతం చేయాలి

పిఆర్ ఉద్యోగుల జెఎసి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జోన్-1 పరిధిలోని జిల్లాల్లో ఉన్న పంచాయతీ రాజ్ అధికారులు, ఉద్యోగులతో నవంబర్‌లో జరిగే పంచాయత్ రాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జెడ్‌పి కార్యాలయ ప్రాంగణంలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి అజెండా రూపొందించి, పరిష్కారానికి ప్రయత్నించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో పిఆర్ జెఎసి నాయకులు వై.వి.ప్రసాద్, కెఎస్‌వి ప్రసాదరావు, జె.సుబ్బారెడ్డి, ఆవు సురేష్, బి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణరాజు, సిహెచ్.మురళీ, కె.బి.శ్రీనివాసరావు, వై.రమణ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఆర్ ఉద్యోగుల జెఎసి నాయకులు

ప్రాణాలను, ఆస్తులను కాపాడటమే లక్ష్యం

- వెంటాడుతున్న సిబ్బంది లేమి
- బాణసంచా అమ్మకాలకు ఖాళీ స్థలం ఉంటేనే అనుమతులు
- నాతవలసలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తాం
- 'ప్రజాశక్తి'తో డిఎఫ్‌ఒ రాంప్రకాశ్ ముఖాముఖి

ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటమే లక్ష్యంగా అగ్నిమాపక శాఖ పనిచేస్తుందని ఆ శాఖ జిల్లా అధికారి (డిఎఫ్‌ఒ) బి.వి.ఎస్ రాంప్రకాశ్ తెలిపారు. ఈ విషయంలో తమ శాఖ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లోనైనా ముందుండి విధులు నిర్వహించే వారిలో అగ్నిమాపక సిబ్బంది మొదటి వరుసలో ఉంటారని వెల్లడించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారి ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. తుపాను సమయంలో తమ విధులు ఎంతో కీలకంగా ఉంటాయన్నారు. అటువంటి అగ్నిమాపక కేంద్రాలు నేడు సిబ్బంది లేమితో సతమతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి అమ్మకాలకు ఖాళీ స్థలం ఉంటేనే షాపులకు అనుమతి ఇస్తున్నామని స్పష్టంచేశారు. ఈ వారం తనను డిఎఫ్‌ఒను 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ విషయాలు...

\- ప్రజాశక్తి, విజయనగరంకోట


జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు ఎన్ని ఉన్నాయి.?

జిల్లా పరిధిలో ఎనిమిది అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అవి కొత్తవలస, శృంగవరపుకోట, విజయనగరం , చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, బాడంగి, గజపతినగరంలో ఉన్నాయి. ప్రస్తుతానికి 9 అగ్నిమాపక శకటాలు అందుబాటులో ఉన్నాయి 15వ ప్రణాళిక సంఘంలో వస్తున్న నిధులతో కొత్త వాహనాలను సమకూర్చుకుంటాం.

శిథిలావస్థకు చేరిన భవనాలు ఏమైనా ఉన్నాయా.? నూతనంగా ఏమైనా నిర్మిస్తున్నారా.?

బొబ్బిలిలో పాత భవనం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉండటంతో దాని స్థానంలో కొత్తది నిర్మించడానికి, నాతవలసలో నూతన ఫైర్‌స్టేషన్‌కు అంచనాలు పంపించాం. వీటి తరువాత గజపతినగరం, రాజాంలో భవనాలు నిర్మిస్తాం.

ఫైర్ సిబ్బంది సరిపడా ఉన్నారా? ఎక్కడైనా ఖాళీలున్నాయా.?




జిల్లా వ్యాప్తంగా ఫైర్ సిబ్బంది కొరత ఉంది. గత రిక్రూట్‌మెంట్‌లో ఫైర్ సిబ్బందిని తీసుకోక పోవడంతో ఈ సమస్య ఏర్పడింది. ప్రస్తుతం 80 మంది సిబ్బందికి గాను 49 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 8 డ్రైవర్ ఉద్యోగాలు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఈ ఏడాదిలో ఎన్ని ప్రమాదాలు సంభవించాయి? ఆస్తి నష్టం ఎంత.?

2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 300 అగ్ని, ఇతర ప్రమాదాలు సంభవించాయి. అగ్ని ప్రమాదాల్లో రూ.2.63 కోట్ల ఆస్తినష్టం సంభవించింది. సహాయక చర్యల వల్ల సుమారు రూ.8,34,16,300 విలువైన ఆస్తులను కాపాడగలిగాం. వీటితోపాటు మూడు పశువుల ప్రాణాలు కోల్పోయాయి. ఎనిమిదింటిని రక్షించాం. ఇతర ప్రమాదాల్లో నాలుగు పశువులు చనిపోగా, రెండింటిని కాపాడాం.

జిల్లాలో దీపావళి పండగ సందర్భంగా షాపులకు అనుమతులు ఇచ్చారా.? నిబంధనలు ఏమిటి.?

విజయనగరం జిల్లా కేంద్రంలో షాపులు పెట్టుకోవడానికి ఎవరికీ, ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదు. హోల్‌సేల్ షాపులు మాత్రం కంట్రోల్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్ డైరెక్టర్ అనుమతులతో ఉంటాయి.



ఖాళీ స్థలం ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తాం. ఎందుకంటే, ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే, దాన్ని నియంత్రించడానికి వెళ్లేలా ఖాళీ స్థలం ఉండాలి. జిల్లా కేంద్రంలో ఈ షాపులు జాతీయ రహదారికి ఇరువైపులా ఇరుగ్గా పెడుతున్నారు. అదే ప్రాంతంలో పెట్రోల్ బంకు ఉంది. ఖాళీ స్థలం లేకుండా, పక్కపక్కనే షాపులు అంటిపెట్టుకొని ఉండటం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని గతేడాది నుంచి చెప్పుకొస్తున్నాం. దానిని ఎవరూ పట్టించుకోకపోవడంతో షాపుల ఏర్పాటుకు అనుమతివ్వడం లేదు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాల్లో ప్రమాదాలు సంభవిస్తే మాకు సంబంధం లేదు. ఇదే విషయాన్ని హోల్‌సేల్ వర్తకులకూ స్పష్టంచేశాం. అవసరమనుకుంటే, జిఒ 253 ప్రకారం చలానా చెల్లించి, అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

ప్రజాశక్తి
www.prajasakti.com

వినయ్‌కు అభినందనల వెల్లువ

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన పతివాడ వినయ్ కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ కబడ్డీ మెన్స్ పోటీలకు ఎంపికవడంతో పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గల కుసుమహారబండ్ గుడి వద్ద పట్టణ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వినయ్ కుమార్‌కు ఆదివారం అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా కోచ్ అల్లి తాతబాబు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరగబోయే కబడ్డీ పోటీలలో జెఎన్‌టియు గురజాడ యూనివర్శిటీ నుంచి వినయ్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు బుగత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కబడ్డీ క్రీడలకు శక్తి సామర్థ్యాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, సీనియర్ క్రీడాకారులు బుగత వెంకటేశ్వరరావు, రేగటిబంద చిట్టిబాబు, కాపుగంటి శ్రీనివాసరావు క్రీడాకారునికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బంగారయ్య, సన్యాసిరావు మాస్టారు, పెదగాడ రాజు, బ్రహ్మాజీ, వీరభద్రుడు పాల్గొన్నారు.

చెరువులో వేసిన గ్రావెల్ తొలగింపు

బొబ్బిలి: పట్టణంలోని మిలటరీ కాలనీ పక్కనున్న చెరువులో వేసిన గ్రావెల్‌ను రెవెన్యూ అధికారులు తొలగించారు. చెరువు ఆక్రమణకు ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి వేసిన మట్టిని ఆదివారం తహశీల్దార్ ఎం.శ్రీను జేసీబీతో తొలగించారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయనతో విఆర్ఒ సురేష్, రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బొబ్బిలి: 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు వేణుగోపాలనాయుడు, రాంబాబు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివారం 108 ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సంస్థ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చిన పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇంటలేటు శోభన్ బాబు, మహేష్, పైటెల్లు వెంకటరమణ, అప్పారావు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు ఆదివారం టిడిపిలో చేరారు. వీరికి టిడిపి రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గౌరీ భాను పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో నాయకులు దన్నాన ఆదినారాయణ, వావిలపల్లి సూరిబాబు, కాకరాపల్లి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత?

నెల్లిమర్ల: స్థానిక పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు సమాచారం. ఆదివారం గుర్ల వైపు నుంచి నెల్లిమర్ల వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ వద్ద పట్టుకున్నారు. అయితే ఈ రెండు ట్రాక్టర్లలో ఒక ట్రాక్టర్‌ని పట్టుకొని వదిలేసినట్లు విమర్శలు వినవస్తున్నాయి. కాగా ఇటీవల ప్రభుత్వం ఇసుక తరలింపే నాటు బళ్లు, ట్రాక్టర్లను పెట్టుకోవద్దని చెప్పినప్పటికీ పోలీసులు పట్టుకోవడమేమిటని ఆయా ట్రాక్టర్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్తు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

నెల్లిమర్ల: విద్యుత్ ఛార్జీల పెంపుదల విరమించుకోవాలని సిపిఐ నాయకులు మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఆదివారం కొండ గుంపాం గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచబోమని హామీలు ఇచ్చారని ఇపుడు 672 కోట్ల రూపాయల భారం మోపడం దారుణమని అన్నారు. సర్దుబాటు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోలిపల్లి సూరి రమణమ్మ, తవిటి నాయుడు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు

బొబ్బిలి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో ఆనందోబ్రహ్మ బృందం సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో ఆదివారం అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినీ గేయాలకు చిన్నారులు నృత్యం చేసి అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఆనందోబ్రహ్మ సభ్యులు జి.గంగాధర్ ప్రేరణ గీతాలు ఆలపించారు. తాండ్రపాపారాయ విద్యార్థులు మానవహారం చేశారు. చిన్నారులను పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు పి.విజయమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి: ఎమ్మెల్యే

కొత్తవలస: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. భారత్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ డిఫెన్స్ అకాడమీ ప్రతినిధులు క్రీడాకారులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం జట్టులో గెలుపొందిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వీసీ సెల్ అధికార ప్రతినిధి బొబ్బిలి అప్పారావు మాస్టర్, క్లస్టర్ ఇంచార్జ్ వెంకట రత్నాజీ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకొచ్చిన యువకులు

బొబ్బిలి: అవయవ దానం చేసేందుకు యువకులు ముందుకు వచ్చారు. పట్టణానికి చెందిన నక్కిన మాధవ్, ఆయన స్నేహితులు కలిసి అవయవ దానం చేసేందుకు అంగీకరిస్తూ అభిమాని ఫౌండేషన్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్ నాయుడుకు అంగీకార పత్రాలను అందజేశారు. అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చిన యువకులను రాజగోపాల్ అభినందించారు. అవయవ దానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు.

కాలుష్య రహితంగా దీపావళి

బొబ్బిలి: కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కె.విజయగౌరి కోరారు. కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని కోరుతూ ఆదివారం పట్టణంలో దీపాలు వెలిగించి ప్రజలకు పిలుపునిచ్చారు. దీపావళికి టపాకాయలు పేల్చడం వలన వాయు కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడతారని గుర్తు చేశారు. కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సభ్యులు కె.కృష్ణదాసు, సత్యారావు, కౌన్సిలర్ ఎం.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో ఉచిత కంటి వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని బొద్దాం పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, సర్పంచ్ ఎర్రా సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది కంటి రోగులకు పరీక్షలు చేసి 25 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనపరెడ్డి ఈశ్వరరావు, శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ సత్యవతి, కార్యక్రమ మేనేజర్ ఎం అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ అమల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - సంతకవిటి

మండల కేంద్రంలో ఎస్ఐ ఆర్.గోపాలరావు ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలను ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా వ్యవసాయ మార్కెట్ గిడ్డంగి పనులు

వేపాడ: మండలంలోని జాకేరు రెవెన్యూ పరిధిలో రూ.42 లక్షలతో వ్యవసాయ మార్కెట్ గిడ్డంగుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ గిడ్డంగి పూర్తయితే ఈ ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రాంత రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సు'రక్షిత'మేనా.?

- గ్రామాల్లో తాగునీటి నిర్వహణ లోపం
- అపారిశుధ్యంగా ట్యాంకర్లు
- ఎక్కడికక్కడ లీకవుతున్న పైపులైన్లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి- వంగర

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మండలంలో పలు గ్రామాలలో తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసింది. వీటిని ప్రతి 15 రోజులకు ఓసారి శుభ్రం చేయడం, ప్రతిరోజు నీరు ఇచ్చే అరగంట ముందు క్లోరినేషన్ చేయాలి. ఈ నిబంధనలు చేపట్టకపోవడం వాటి నిర్వహణ సక్రంగా లేకపోవడంతో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందటం లేదు. ప్రధానంగా అందిన తాగునీరు కూడా పరిశుభ్రంగా లేక కలుషితమవుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడి అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని గుర్ల మండలంలో కూడా రక్షిత మంచినీటి పథకాలు కలుషితం అవ్వడం వల్లే డయేరియా వచ్చి చాలా మంది చనిపోయారని ఇప్పటికైనా రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేసి తాగునీటిని ప్రతిరోజు అందించాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



సీతారాంపురంలో పైపు లీకు కావడంతో కట్టిన గుడ్డలు

మండలంలోని 29 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీలన్నింటికీ తాగునీరు అందించేందుకు మగ్గూరు సమీపంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. దీనికి తోడు 20 గ్రామాలలో తాగునీటి ట్యాంకర్లు (రక్షిత మంచినీటి పథకం) ఉన్నాయి. వీటి నిర్వహణ, పైప్‌లైన్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తలగాంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్‌పై కప్పు లేకపోవడంతో అందులో పక్షులు పడిపోవడం, వర్షపు నీరు చేరుతుండటం వంటివి జరుగుతున్నప్పటికీ దానిని పరిశుభ్రం చేయటం లేదని ఆ గ్రామంలో ఉన్న ఎస్సీ కులస్తులు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో అదే నీటిని తాగుతున్నామని వాపోతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసిన పట్టించుకోలేదని తెలిపారు.

ఎం సీతారాంపురంలో రంగస్వామి వీధిలో వేసిన పైపులైను పాడై నాలుగు చోట్ల లీకులు కావడంతో నీరంతా వృథాగా పోవడంతో పాటు, నీరు కలుషితమవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని అక్కడ మహిళలు వెల్లడించారు. ఈ విషయంపై అక్కడ సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. కొప్పర, కొండచాకరాపల్లి, మద్దివలస తదితర గ్రామాలలో రక్షిత మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా లేక, సమయపాలన లేకుండా ఇస్తున్నారని కుళాయిల ద్వారా ఎప్పుడు నీరు ఇస్తారో.. ఇవ్వరో తెలియని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తాగునీటి ట్యాంకర్లు కూడా శుభ్రం చేసే పని మొక్కుబడిగానే ఉంటుందని ఆగ్రహిస్తున్నారు.

ఇంటింటా కుళాయిలు ఏమైనట్టు

గత ప్రభుత్వంలో అధికారులు, నాయకులు వివిధ సమావేశాల్లోనూ, సభల్లోనూ ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్న మాటలు హామీలకే పరిమితమయ్యాయి. పనులు చేసిన చోట కూడా నాణ్యతలేని పనులు జరిగాయనే విమర్శలను ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మండలంలోని శివ్వాం, ఓని అగ్రహారం తదితర గ్రామాలలో ఇంటింటా కుళాయిలు వేసి ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నీరు కలుషితమైపోతుందని చెబుతున్న మహిళలు

లీకులు అరికడతాం

ఎం.సీతారాంపురంలో పైపులు లీకులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి ఇంజనీర్‌తో మాట్లాడి లీకులు అరికడతాం. తలగాం వాటర్ ట్యాంకు పైకప్పుకు సంబంధించి ఇప్పటికే కార్యదర్శికి చెప్పాం, మరోసారి చెప్పి ఆ పని పూర్తి చేస్తాం.

చరణ్, జె.ఇ, ఆర్‌డబ్ల్యుఎస్ వంగర

మురికి కూపంగా సాగునీటి కాలువ

- దుర్వాసనతో అవస్థలు
- కాలువ దాటాలంటే ముక్కుమూయాల్సిందే
- ఆందోళనలో మండల కేంద్ర ప్రజలు

ప్రజాశక్తి-జామి

మండల కేంద్రమైన జామి గ్రామం గుండా ప్రవహించే జాగారం - అన్నంరాజపేట కాలువ మురికి కూపంగా మారింది. ఇది గ్రామం మధ్య నుంచి ప్రవహించడంతో కాలువ పరివాహక ప్రాంతాలైన వీదులన్నీ దుర్వాసనలు బారిన పడుతున్నాయి. ప్రధానంగా జామి మేజరు పంచాయతీ చెత్తతో సాగునీటి కాలువ కాస్త మురుగు కాలువగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే జామి గ్రామంలో ఆపారిశుధ్యం తాండవించేలా చేస్తోందని మండల కేంద్ర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మండలంలో జాగారం-అన్నంరాజుపేట సాగు నీటి కాలువ 5 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. అందులో సగబాగం జామి మేజరు పంచాయతీలోనే ప్రవహిస్తోంది. వాస్తవానికి సాగునీటి కాలువలో ఎటువంటి వ్యర్థాలు, మలినాలూ కలవకూడదు. కానీ యథేచ్ఛగా పంచాయతీలోని వ్యర్థాలు కాలువలో కలిపేస్తున్నారు. ఫలితంగా జెఎ ఛానల్ మురుగు కూపంలా మారిపోయి, ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని జామి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, మండల స్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప నివారణ చర్యలు చేపట్టడంలో తాత్సరం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జామి మేజరు పంచాయతీలో 12,732 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం గుండా సుమారుగా మూడు కిలో మీటర్ల మేర జెఎ ఛానల్ కాలువ ప్రవహిస్తోంది. స్వచ్ఛమైన సాగునీటితో ప్రవహించే కాలువ సైతం నేడు కలుషితమైన మురుగు కాలువగా మారి నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. ఇది కూడా మండల పరిషత్తు కార్యాలయానికి ఆనుకుని ఉండటం, అక్కడకు రోజుకి సిబ్బందితో పాటు ఇతర ప్రజలు వందలాది మందిగా వస్తుండటం, వీరంతా ఈ దుర్వాసనతో ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్యానికి గురవుతుండటం నిత్య కృత్యంగా మారింది. ఒక అపారిశుద్యం తాండవించడమే కాదు. సాగునీటి కాలువ పూడిక పోయి, చివరి ఆయకట్టుకు నీరు కూడా వెళ్ళని పరిస్థితి నెలకొంది.



పేరుకుపోయిన మురుగు

కాలువే డంపింగ్ యార్డు

గ్రామానికి చెందిన చెత్తతో పాటు చికెన్ దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను సైతం కాలువలో పడేయడం వల్ల కాలువ మొత్తం కలుషితమై దుర్వాసన వస్తోంది. ఒక్క చికెన్ దుకాణాలు మాత్రమే కాదు.. చేపలు, మటన్ షాపుల్లో మిగిలిన వ్యర్థాలు, కళ్యాణ మండపంలోని మిగులు వ్యర్థాలు కాలువలోనే పడేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈగలు, దోమలు వ్యాప్తి పెరిగి, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా నెయ్యిల వీధి, పడాల వీధి, మంగల వీధి, బిసి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దోమలు, విష కీటకాల బారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలువలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

కాలువలో వ్యర్థాలు వేయకూడదు

సాగునీటి కాలువలో వ్యర్థాలు వేయకూడదు. పంచాయతీ దృష్టికి తీసుకెళ్లి కాలువ కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- సంతోష్, ఇరిగేషన్ జెఇ

జనసేనలోకి కొవ్వాడ సర్పంచ్ రఘు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు ఆదివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు పలువురు వార్డు మెంబర్లు, వందలాది మంది ప్రజలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొవ్వాడలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను నమ్మి అనేక మంది జనసేనలోకి వస్తున్నారన్నారు. అధినేత పవన్ కళ్యాన్ నిబద్ధత, నిజాయితీ, ప్రజలపై ఆయనకున్న శ్రద్ధ చూసి అనేకులు పార్టీలోకి వస్తున్నారన్నారు. త్వరలో వైసిపి ఖాళీ అవబోతుందని బైబై వైసిపి అనే నినాదంతో మానాయకుడు వచ్చారని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంలో నాయకులు, ప్రజలకు ఆహ్వానం ఇస్తున్నామని రండి కలసి నియోజకవర్గాన్ని మిని స్మార్ట్‌సిటీగా తాయారు చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గంగపుత్రులను, యాధవలను అభివృద్ధి పదంలో నడిపించాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. కొవ్వాడ గ్రామాన్నే కాదు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, నెల్లిమర్ల నాయకులు చనమల్లు వెంకట రమణ, డెంకాడ ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, చల్లబోయిన నర్సింగరావు, పతివాడ శ్రీను, బాలా అప్పలరాజు, శంకాబత్తుల సత్తిబాబు, మహంతి శివ, నక్కాన రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం: గ్రామాభివృద్ధే తన ధ్యేయమని, తమ గ్రామం అభివృద్ధి జరగాలంటే లోకం నాగమాధవి ద్వారానే అని గట్టిగా నమ్మి తామంతా వైసిపిని వీడుతున్నామని సర్పంచ్ కోట్ల రఘు అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చాయని ఆయన ప్రజలు కోసం పనిచేసే నాయకుడని గ్రహించామని అందుకే పార్టీలో చేరుతున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి అనుకున్నంతగా పాలన అందించలేకపోయాడు. ఆయనతో పాటు తమకు కూడా చెడ్డపేరు వచ్చిందని జనసేనతోనే తమకు భవిష్యత్తని గ్రహించామని చెప్పారు. తాము పార్టీలోకి రాకుముందే తమ గ్రామానికి రూ. 2 కోట్లతో తారురోడ్డు మంజూరు చేశారన్నారు. పార్టీని చూడకుండా పనిచేసే నాయకురాలైన మాధవితో పాటు అభివృద్ధిలో బాగస్వామ్యం కావాలని పార్టీలో చేరామని ఆయన స్పష్టం చేశారు.



రఘును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

వైసిపి నుంచి జనసేనలోకి చేరికలు

బొబ్బిలి : వైసిపి మండల యూత్ విభాగం కన్వీనర్ ఎన్.వెంకటేష్, సీతయ్యపేట ఉప సర్పంచ్ ఎన్. భానుతో పాటు మరో 50మంది ఆదివారం వైసిపిని వీడి జనసేనలో చేరారు. వీరికి జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి జనసేన కండువాలు వేసి ఆహ్వానించారు. నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్, టి.జగదీష్, మహేష్, శరత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మృతి

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి పట్టణంలో జి. అగ్రహారానికి చెందిన ఆశయ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి రమణ విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఇటీవల అప్పన్నవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని చీపురుపల్లి గ్యాస్ ఆఫీస్ నుంచి అగ్రహారం వరకూ భారీ ర్యాలీగా తీసుకెళ్లారు. ఆయనకు భార్య ఒక కుమారుడు ఉన్నారు. ఈ ర్యాలీలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రైతు కామినాయుడు, నాయకులు శ్రీనివాసులునాయుడు, ఇప్పిలి అనంతం, ముల్లు రమణ పాల్గొన్నారు.

25 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు

రెడ్డి రమణ గత 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలను తన సొంత నిధులతో ఖర్చు చేస్తూ సహాయ స్వచ్ఛంద సేవా సంస్థ పేరు మీద సేవలందిస్తున్నారు. ఆయన ఎన్నో రక్తదాన శిబిరాలు, అనాథలకు భోజన వసతి ఏర్పాటు, ప్రకృతి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేవారు. ప్రతి వినాయక చవితికి ప్రకృతి కాలుష్యం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులను వేల సంఖ్యలో పంపిణీ చేశారు. మొబైల్ బైక్ లైబ్రరీ ద్వారా ప్రతి గ్రామంలోనూ పాఠశాలలకు, ప్రజలు ఉండే చోటకు ఎన్నో పుస్తకాలను తీసుకువెళ్లి అక్కడ చదివించేవారు. అత్యవసర సమయంలో ఎవరికి రక్తం అవసరమైనా ఉచితంగానే వారికి రక్త నిల్వలను అందిస్తుండేవారు అతను జిఎంఆర్ సంస్థలో ఓ చిరు ఉద్యోగిగా పనిచేస్తూ సగం జీతాన్ని కుటుంబానికి మిగిలిన సగం జీతం సమాజానికి ఖర్చు చేసేవారు. రోడ్డుకి ఇరువైపులా ఉండే బిక్షగాళ్లకు దుప్పట్లు, బట్టలు, ఆహారం అందిస్తుండేవారు. అనాథలు చనిపోతే అటువంటి వారికి సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేసేవారు. ఆయన సేవలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుర్తించి రూ. 2లక్షల చెక్‌ను అందించి ప్రోత్సహించారు. అటువంటి వ్యక్తి మృతి చెందడంతో నియోజకవర్గంలోని ప్రజలంతా కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రేఖ

ప్రజాశక్తి- విజయనగరం



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ కె. రేఖ నియమితులయ్యారు. ఆమె ఎంఎస్‌సి, ఎంటెక్, పిహెచ్‌డి విద్యార్హతలు కలిగి ఉన్నారు. డాక్టర్ విఎస్ కృష్ణ కళాశాలలో బయోటెక్ డిపార్ట్మెంట్ హెచ్ఒడిగా పనిచేసి ప్రిన్సిపల్‌గా పదోన్నతి పొందారు. ప్రభుత్వం 16 మందికి ప్రిన్సిపల్ ప్రమోషన్లు ఇచ్చారు. వాటిలో భాగంగా ఈమెకు ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ వచ్చింది. కళాశాల 2019లో ఏర్పడినప్పటికీ ఇంతవరకు ఇన్చార్జి ప్రిన్సిపల్స్ తోనే కళాశాల నడిచింది. రెగ్యులర్ అధ్యాపకులు, 400మందికి మించి విద్యార్థులు ఉన్నప్పటికీ, ఇంచార్జ్ ప్రిన్సిపల్స్‌తోనే ఇంతవరకు కళాశాల నడవడం గమనార్హం. ఎఫ్ఎసి ప్రిన్సిపల్ డాక్టర్ బి. శుభ చేతుల మీదుగా, డాక్టర్ కే.రేఖ రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృత కళాశాలలో షిఫ్ట్ సిస్టంలో డిగ్రీ కళాశాల నడుస్తున్నందువల్ల అనేక సమస్యలు ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన రేఖను సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జనార్ధన్ నాయుడు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.